


RNI : APBIL/2023/86665

# రాయల్ జర్నలిజం

ద్వి భాషా దినపత్రిక

ROYAL JOURNLISAM

గుంటూరు, సంపుటి : 03 సంచిక : 06 | మంగళవారం 12 - 8 - 2025 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | పేజీలు : 8 వెల : రూ.2-00

GUNTUR VOL-03 ISSUE - 06 CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO 12 TUESDAY AUGUST 2025 PAGES : 8 Rs :2-00


## కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు లోక్‌సభ ఆమోదం



దిల్లీ: కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. బైజయంత్ పాండా సారథ్యంలో 31 మంది సభ్యులతో కూడిన సెలక్షన్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు నవీకరించిన బిల్లును ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం ప్రవేశపెట్టారు. బిల్లు ప్రవేశపెట్టిన కొన్ని గంటల్లోనే ఎలాంటి చర్చా జరగకుండానే మూజువాణి ఓటుతో సభామోదం పొందింది. బిహార్ ఓటర్ల సమగ్ర సవరణపై విపక్షాలు ఆందోళన నిర్వహిస్తుండడంతో దీనిపై చర్చకు తావులేకుండా పోయింది. బిల్లు పాసైన అనంతరం సభ మంగళవారానికి వాయిదా పడింది. ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న ఆదాయపు పన్ను చట్టం-1961 స్థానంలో ఈ ఏడాది ఫిబ్రవరిలోనే కేంద్రం లోక్‌సభలో ఆదాయపు పన్ను బిల్లు, 2025ను ప్రవేశపెట్టింది. విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో దాన్ని సెలక్ట్ కమిటీకి పంపించింది. కమిటీ ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకున్న అనంతరం.. ఆదాయపు పన్ను (నం.2) బిల్లు-2025ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. గత శుక్రవారం పాత బిల్లును ఉపసంహరించుకున్నారు. సెలక్ట్ కమిటీ సిఫార్సులన్నింటినీ దాదాపుగా ఆమోదించినట్లు మంత్రి వెల్లడించారు. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి 66 బడ్జెట్‌లలో (రెండు మధ్యంతర బడ్జెట్లు కలిపి) ఎన్నో సవరణలు జరిగాయి. దీంతో సంక్లిష్టంగా తయారైంది. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు కొత్త బిల్లును రూపొందించారు. లోక్‌సభ ఆమోదం పొందిన నేపథ్యంలో ఈ బిల్లు తదుపరి రాజ్యసభకు వెళ్లనుంది. రాష్ట్రపతి ఆమోద ముద్రతో కొత్త చట్టంగా మారనుంది. 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది.

**బిల్లులోని కీలక అంశాలు..**

- పాత ఆదాయపు పన్ను చట్టంలో 'క్రితం సంవత్సరం' 'అసెస్‌మెంట్ ఇయర్' అనే పదాలు వాడుకలో ఉన్నాయి. కొత్త బిల్లులో వీటి స్థానే 'పన్ను సంవత్సరం' వినియోగంలోకి రానుంది.
- 2025 ఆదాయపు పన్ను బిల్లు కొత్త పన్నులేమీ విధించదు. ప్రస్తుతం ఉన్న పన్ను శ్లాబులు, రేట్లను మార్చదు. అలాగే ఐటీఆర్ ఫైలింగ్ గడువు తేదీలు, ఆదాయపు పన్ను శ్లాబులు, మూలధన లాభాల్లో ఎటువంటి మార్పులూ ఉండవు.
- వేతనాల నుంచి డిడక్షన్ల విషయానికొస్తే అంటే స్టాండర్డ్ డిడక్షన్, గ్రాడ్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితరాలు వేర్వేరు సెక్షన్లు, నిబంధనల కింద ఉన్నాయి. వీటిని ఒకే దగ్గరకు తీసుకొచ్చి పట్టిక రూపంలో కనిపిస్తాయి.


## ఏపీ మద్యం కుంభకోణం.. అదనపు ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన సిట్




విజయవాడ: ఏపీ మద్యం కుంభకోణం కేసులో సిట్ అదనపు ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. 200 పేజీలతో కూడిన ఛార్జ్‌షీట్‌ను విజయవాడలోని ఏసీబీ కోర్టుకు సిట్ అధికారులు సమర్పించారు. నిందితులు ధనుంజయరెడ్డి (ఏ 31), కృష్ణమోహన్‌రెడ్డి (ఏ 32), గోవిందప్ప బాలాజీ (ఏ 33) ప్రమేయం, నగదు తరలింపు అంశాలను దీనిలో సిట్ పేర్కొన్నట్లు సమాచారం. ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డితో వీరికి గల సంబంధాలు, నగదును అంతిమ లబ్ధిదారుకు చేర్చిన విధానాన్ని ఛార్జ్‌షీట్‌లో సిట్ ప్రస్తావించినట్లు తెలుస్తోంది. మద్యం కుంభకోణం కేసులో గత నెల 19న సిట్ అధికారులు ప్రాథమిక ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. అందులో ఉన్న 9 సంస్థలు, ఏడుగురు వ్యక్తులపై అభియోగాలు మోపింది. ఇప్పుడు దానికి అనుబంధంగా మరో ఛార్జ్‌షీట్‌ను సిట్ దాఖలు చేసింది. ఈ కేసులో ఇప్పటివరకు 19 సంస్థలు, 29 మంది వ్యక్తులు నిందితులుగా ఉన్నారు. రాజ్ కెసిరెడ్డి (ఏ1), బూనేటి చాణక్య (ఏ-8), పైలా దిలీప్ (ఏ-30), సజ్జల శ్రీధర్‌రెడ్డి (ఏ-6), కె.ధనుంజయరెడ్డి (ఏ-31), పి.కృష్ణమోహన్‌రెడ్డి (ఏ-32), గోవిందప్ప బాలాజీ (ఏ-33), సీహెచ్.వెంకటేశ్‌నాయుడు (ఏ-34), చెవిరెడ్డి భాస్కరరెడ్డి (ఏ-38), పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి (ఏ-4), బాలాజీ కుమార్ యాదవ్ (ఏ-35), ఈ.నవీన్ కృష్ణ (ఏ-36) సహా మొత్తం 12 మంది అరెస్టయ్యారు. కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. అది పూర్తయ్యాక ఇంకో అనుబంధ ఛార్జ్‌షీట్‌ను సిట్ అధికారులు దాఖలు చేయనున్నారు.

### అమెరికా అండతో అసలు రంగు చూపిస్తోన్న పాక్..

## మునీర్ 'అణు బెదిరింపుల'పై భారత్ మండిపాటు



దిల్లీ: అమెరికా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్.. అక్కడి నుంచే భారత్‌పై అణు బెదిరింపులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఆయన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన ఉన్మాద దేశమని దుయ్యబట్టింది. అమెరికా అండ చూసుకుని ఇప్పుడు దాయాది తన అసలు రంగు చూపిస్తోందని మండిపడింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ దీనిపై ప్రకటన విడుదల చేసింది. "అణ్వాయుధాల వినియోగంపై బెదిరింపులు పాక్‌కు అలవాటే. ఇలాంటి వ్యాఖ్యలతో (మునీర్ మాటలను ఉద్దేశిస్తూ) ఆ దేశం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందో అంతర్జాతీయ సమాజం అర్థం చేసుకోవాలి. పాక్ అణ్వాయుధాలపై ఎవరి నియంత్రణ ఉందో దీన్ని బట్టి స్పష్టమవుతోంది. అక్కడ సైన్యం, ఉగ్ర ముఠాలతో చేతులు కలిపింది. అమెరికా గడ్డపై మునీర్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం విచారకరం. అయితే, ఇలాంటి అణు బెదిరింపులకు భారత్ భయపడదు. దేశ భద్రత కోసం ఎలాంటి చర్యలకైనా వెనుకాడబోం" అని విదేశాంగ శాఖ తమ ప్రకటనలో వెల్లడించింది. అంతకుముందు కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి వర్గాలు కూడా దీనిపై స్పందించాయి. "పాక్ మిలిటరీకి అమెరికా మద్దతిచ్చినప్పుడల్లా.. వారు తమ నిజస్వరూపాన్ని బయటపెడుతూనే ఉంటారు. అక్కడ (దాయాదిని ఉద్దేశిస్తూ) ప్రజాస్వామ్యం లేదని దీన్ని బట్టి చూస్తే తెలుస్తోంది. ఆ దేశాన్ని సైన్యమే నియంత్రిస్తోంది. పాక్ వద్ద ఉన్న అణ్వాయుధాలు ఉగ్రవాదుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది. అదే జరిగితే ఈ ప్రాంతంతో పాటు ప్రపంచం మొత్తానికి ముప్పు ఎదురైనట్లే" అని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఫ్లోరిడాలో ఓ కార్యక్రమంలో మాట్లాడిన మునీర్.. భారత్‌పై మరోసారి నోరుపారేసుకున్నారు. తమది అణ్వాయుధ సామర్థ్యం కలిగిన దేశమని, ఒకవేళ భవిష్యత్తులో న్యూదిల్లీ నుంచి తమ అస్థిత్వానికి ముప్పు ఎదురైతే.. తమతో పాటు సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామంటూ ప్రేలాపనలు చేశా రు. కాగా.. మునీర్ అమెరికా పర్యటనకు వెళ్లడం గత రెండు నెలల్లో ఇది రెండోసారి. భారత్‌పై ట్రంప్ సుంకాల భారం మోపుతున్న వేళ మునీర్ అగ్రరాజ్యంలో పర్యటిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

### అవసరమైతే సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళతా..

## నిర్మాతలతో భేటీపై మంత్రి దుర్గేశ్



అమరావతి: టాలీవుడ్‌లో నెలకొన్న సమస్యలపై పలువురు అగ్ర నిర్మాతలు . ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్‌తో భేటీ అయిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అపాయింట్‌మెంట్ కావాలని మంత్రిని కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందించారు. నిర్మాతలతో సమావేశం అనంతరం మంత్రి మాట్లాడారు. "ప్రస్తుతం టాలీవుడ్‌లో నెలకొన్న పరిణామాల గురించి తెలియజేయడానికి నిర్మాతలు వస్తామన్నారు. ఆ మేరకు కలిశారు. ప్రత్యేక ఎజెండా ఏమీ లేదు. ఆందోళన నేపథ్యంలో సినీ కార్మికులు, నిర్మాతలు ఇరువురూ చెప్పే విషయాలు వింటాం. ఈ అంశంపై ఫెడరేషన్, ఫిల్మ్ ఛాంబర్ సామరస్యంగా మాట్లాడుకోవాలి. అవసరమైతే సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి సంబంధిత అంశాన్ని తీసుకెళ్లి చర్చిస్తాం. ప్రభుత్వ జోక్యం అవసరమైతే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయం తీసుకుంటారు. ఏపీలో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు కృషి చేస్తాం. ఏపీలో ఎవరైనా స్టూడియోలు, రీ రికార్డింగ్ థియేటర్లు, డబ్బింగ్ థియేటర్లు నిర్మించాలని ముందుకు వస్తే ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తాం" అని పేర్కొన్నారు.

**నిర్మాతల విజ్ఞప్తి..:** మంత్రి దుర్గేశ్‌తో సమావేశం అనంతరం నిర్మాతలు మీడియాతో మాట్లాడారు. "ఏపీలో సినీ పరిశ్రమ అభివృద్ధికి సూచనలు ఇచ్చాం. సినీ రంగానికి సంబంధించి ఏపీలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరాం. డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లను ఆదుకునేలా ప్రోత్సాహకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశాం. సినీ రంగాన్ని ప్రత్యేక పరిశ్రమగా గుర్తించాలని కోరాం. థియేటర్ల యజమానులు నష్టపోతున్న దృష్ట్యా ఆదుకోవాలని విన్నవించాం. సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక పాలసీ రూపొందించాలని కోరాం. సమస్యల పరిష్కారానికి ఏపీ సీఎం అపాయింట్‌మెంట్ కోరాం. ఇప్పిస్తామని మంత్రి దుర్గేశ్ హామీ ఇచ్చారు. త్వరలోనే ఏపీ సీఎం, డిప్యూటీ సీఎంను కలుస్తాం" అని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో బీవీఎస్ఎన్ ప్రసాద్, రవిశంకర్ యలమంచిలి, టీజీ విశ్వప్రసాద్, నాగవంశీ, డీవీవీ దానయ్య, బన్నీ వాసు తదితరులున్నారు.

## ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుంటే మౌనంగా ఉండలేం: సీఎం స్టాలిన్



చెన్నై: భాజపా , ఎన్నికల సంఘం కలిసి ఎన్నికల్లో 'భారీ నేరపూరిత మోసానికి' పాల్పడ్డాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇటీవల చేసిన ఆరోపణలకు తమిళనాడు సీఎం, డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ మద్దతు తెలిపారు. ఎన్నికల సంఘాన్ని భాజపా 'పోలింగ్ రిగ్గింగ్ యంత్రం'గా మార్చిందంటూ ఆరోపణలు గుప్పించారు. ఈ పోరాటంలో కాంగ్రెస్‌తో డీఎంకే కలిసి నిలబడుతుందన్నారు. భాజపా.. ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే అపహాస్యం చేస్తుంటే మౌనంగా ఉండలేం అని వ్యాఖ్యానించారు. ప్రతి రాష్ట్రానికీ పూర్తి మెషిన్ రీడబుల్ ఓటరు జాబితా విడుదల చేయాలని ఈ సందర్భంగా స్టాలిన్ డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని కోరారు. మరోవైపు, ప్రతి భారతీయుడికి ఓటు హక్కు కోసం ప్రతిపక్షాలు నిరసన తెలుపుతున్నాయని, స్పష్టమైన ఓటర్ల జాబితాను ఈసీ విడుదల చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. కర్ణాటకలో తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ఓ నియోజక వర్గంలో సర్వే నిర్వహించగా.. దాదాపు లక్ష నకిలీ ఓట్లు తేలిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నిజాన్ని దేశం ముందుంచినా.. ఎన్నికల సంఘం మాత్రం దీనిపై మౌనం వహించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బిహార్‌లో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణను నిరసిస్తూ దిల్లీలో విపక్ష ఎంపీలు 'పార్లమెంట్ టు ఈసీ' ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. విపక్ష ఎంపీలు బారికేడ్లు ఎక్కి నిరసన తెలపగా.. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా విపక్ష ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## మహిళలకు 'ఉచిత బస్సు'.. వైకాపా ఓర్చుకోలేకపోతోంది: మంత్రి మండిపల్లి



అమరావతి: గత ప్రభుత్వం ఆర్టీసీని విచ్ఛిన్నం చేసిందని ఏపీ రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మండిపడ్డారు. అన్ని ఒడిదొడుకులను ఓర్చుకొని కూటమి ప్రభుత్వం మహిళలకు స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తుంటే వైకాపా ఓర్చుకోలేకపోతోందన్నారు. మహిళలకు మేలు చేస్తుంటే జగన్ సొంత మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి తల్లికి, చెల్లికి లబ్ధి చేకూరుస్తామన్నారు. పథకం అమలుకు సంబంధించి విధివిధానాలు విడుదలైన సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. "ఆర్టీసీ బస్సుల్లో మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రయాణికుల సౌకర్యవంతమైన ప్రయాణం కోసం సిబ్బందిని పెంచుతున్నాం. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఈ పథకం పూర్తిస్థాయిలో అమలులో ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, మెట్రో, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులే 74 శాతం నడుస్తున్నాయి. వాటిలోనే ఎక్కువమంది మహిళలు ప్రయాణిస్తున్నారు. అందుకే ఆ బస్సుల్లోనే ఉచిత ప్రయాణాన్ని అమలు చేసి ఎక్కువ మందికి లబ్ధి చేకూరుస్తున్నాం. నాన్ స్టాప్, సూపర్ లగ్జరీ, ఏసీ తరహా బస్సులు పరిమిత సంఖ్యలోనే ఉన్నాయి. ఆర్టీసీ స్థితిని దృష్టిలో ఉంచుకొని, పథకం దీర్ఘకాలం నిలబడేలా ఆర్థిక సమతుల్యతతో పథకం అమలు చేస్తున్నాం. దీని ద్వారా లక్షలాది మహిళలు ఉద్యోగాలు, విద్య, వైద్య సేవల కోసం ఉచితంగా ప్రయాణించే అవకా శం పొందనున్నారు"అని మంత్రి మండిపల్లి తెలిపారు.

## మోదీ ఓట్ల దొంగ కాబట్టే మౌనంగా ఉన్నారు: షర్మిల




అమరావతి: బీజేపీ, ఈసీకి వ్యతిరేకంగా'ఓట్ చోర్ క్యాంపెయిన్'ను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఏపీలో సైతం ఈ కార్యక్రమాన్ని ప్రతి గడపకు చేరుస్తామని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తెలిపారు. ఓట్ల దొంగ మోదీ తీరును, బీజేపీ కోసం అధికార దుర్వినియోగం చేసిన ఎన్నికల కమిషన్ వైఖరిని ఎండగడతామని చెప్పారు. ప్రజాస్వామ్యమే ఈసీకి ముఖ్యమని భావిస్తే... రాహుల్ గాంధీ లేవనెత్తిన సందేహాలకు బదులివ్వాలని డిమాండ్ చేశారు. నకిలీ ఓటర్ల జాబితా ఎందుకు తారుమారయిందని షర్మిల ప్రశ్నించారు. డిజిటల్ ఓటర్ జాబితాను ఎందుకు ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతలను ఎందుకు బెదిరిస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీకి ఎన్నికల సంఘం ఏజెంట్ గా మారిందా? అని నిలదీశారు. దొడ్డిదారిలో గెలుపు కోసం ఎన్నికల కమిషన్ నే బీజేపీ కలుషితం చేసిందని షర్మిల మండిపడ్డారు. స్వతంత్ర వ్యవస్థ అయిన ఈసీ బీజేపీ చేతిలో కీలుబొమ్మగా మారిందని, ఆర్ఎస్ఎస్ లాంటి అనుబంధ సంస్థల జాబితాలో చేరిందని విమర్శించారు. మోదీ ఓట్ల దొంగ కాబట్టే మౌనంగా ఉంటున్నారని అన్నారు.

# మహిళలు, వృద్ధుల ఫిర్యాదుల పై సత్వరమే సమగ్ర విచారణ జరిపి పరిష్కరించాలి



రాయల్ జర్నలిజం (బాపట్ల)ఆగష్టు 11: వృద్ధులు, మహిళల పిర్యాదులు అత్యంత ప్రాధాన్యతతో వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొన్నారు. జిల్లాలోని నలుమూలల నుండి వచ్చిన 54 మంది అర్జీదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించారు. వృద్ధాప్యంతో నడవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బల్లికురవ మండలంకు చెందిన ఆలకుంట గురవయ్య అనే వృద్ధుడు ఎస్పీ కార్యాలయానికి రావడంతో, విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ స్వయంగా ఆయన వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఆయన ఆస్తిని ఇద్దరు కుమారులకు సమానంగా పంచి, కొంత భాగాన్ని తన అవసరాల కోసం ఉంచుకున్నానని, అయితే పెద్ద కుమారుడు ఆ భాగాన్ని దక్కించుకునేందుకు ఇబ్బందులు కలిగిస్తున్నాడని వాపోయారు. జిల్లా ఎస్పీ తక్షణమే సంతమాగులూరు సీఐకి ఫోన్ చేసి, పూర్తి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ, సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని వృద్ధుడికి భరోసా కల్పించారు. మహిళలు, వృద్ధులకు సంబందించిన ఫిర్యాదులను ముఖ్య ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి పరిష్కరించాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను నిర్దిష్ట గడువులోపు చట్టపరిధిలో విచారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సంపూర్ణ నివేదికను జిల్లా పోలీస్ కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డిఎస్పీ పి.జగదీష్ నాయక్, పిజిఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ యు.శ్రీనివాసరావు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# హెడ్ కానిస్టేబుల్ పర్వతరెడ్డి వెంకటస్వామి పార్థివ దేహానికి పోలీస్ అధికారులు ఘన నివాళి



రాయల్ జర్నలిజం (బాపట్ల)ఆగష్టు 11: హెడ్ కానిస్టేబుల్ మృతి పట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి సంతాపం తెలియజేసినారు. బాపట్ల జిల్లా జే.పంగులూరు పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న హెచ్.సి 3939, పర్వతరెడ్డి వెంకటస్వామి (52) ఆగస్టు 10న ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందినారు. చిన్నగంజాం మండలం సోపిరాల గ్రామంలోని అయన స్వగృహం నందు పార్థివ దేహాన్ని ఉంచగా చీరాల డి.ఎస్.పి మోయిన్, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున, ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది, సహ ఉద్యోగులు పూలమాలలు వేసి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. అనంతరం స్థానిక స్మశానవాటికలో సోమవారం ఉదయం పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. వెంకటస్వామి 1993లో ఈస్ట్ గోదావరి జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరారు. అనంతరం ఏఆర్ నుంచి సివిల్ శాఖకు మారి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అనేక పోలీస్ స్టేషన్ లలో విధులు నిర్వర్తించారు. సమర్థవంతంగా విధులు నిర్వహించి హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొందినారు. ప్రస్తుతం జే.పంగులూరు పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. హెడ్ కానిస్టేబుల్ మృతి పట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని, శాఖాపరంగా కుటుంబానికి రావాల్సిన అన్ని రకాల పరిహారాలు మరియు రాయితీలు సకాలంలో అందించడానికి కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు. తీవ్ర శోకసంద్రంలో వున్న కుటుంబ సభ్యులను పరామర్శించి, దగ్గరుండి పోలీస్ శాఖ అధికార లాంఛనాలతో పార్థివ దేహానికి అంత్యక్రియలు నిర్వహించాలని అద్దంకి రూరల్ సిఐ డి.మల్లికార్జునరావు, జే.పంగులూరు ఎస్.ఐ బి.వినోద్ బాబు, చిన్నగంజాం ఎస్.ఐ ఎస్.రమేష్ లను జిల్లా ఎస్పి ఆదేశించారు. జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ పార్థివ దేహానికి పోలీస్ అధికారులు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. మృతుని సతీమణి హేమలత, కుమార్తెలు శ్రీలక్ష్మి, పల్లవి లను పరామర్శించారు. మట్టి ఖర్చుల నిమిత్తం పోలీస్ శాఖ నుండి రూ.1,00,000/- నగదును మృతుని సతీమణికి పోలీస్ అధికారులు అందజేసినారు. ఈ కార్యక్రమంలో చీరాల డిఎస్పి ఎమ్.డి.మోయిన్, అద్దంకి రూరల్ సిఐ డి.మల్లికార్జునరావు, జే.పంగులూరు ఎస్.ఐ



బి.వినోద్ బాబు, చిన్నగంజాం ఎస్.ఐ ఎస్.రమేష్, ఆర్.ఎస్.ఐ గోపి ఇతర పోలీస్ అధికారులతో పాటు డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, ఉప కలెక్టర్ లవన్న మరియు అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత చూపని అధికారులపై చర్యలు తప్పవు:జి. గంగాధర్ గౌడ్




రాయల్ జర్నలిజం (బాపట్ల)ఆగష్టు 11: ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఇన్చార్జ్ జిల్లా సంయుక్త కలెక్టర్ జి. గంగాధర్ గౌడ్ అధికారులకు సూచించారు. సోమవారం, స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని తక్షణమే పరిష్కరించేలా పనిచేయాలని ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మొత్తం 160 వినతులు అందాయి, పలు సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గం చేశారు. మిగిలిన వాటిని సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. పిజిఆర్ ఎస్ లో వచ్చే సమస్యలను నాణ్యతతో పరిష్కరించాలని ఆయన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత చూపని అధికారులపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అధికారులను హెచ్చరించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఇన్చార్జి జిల్లా సంయుక్త కలెక్టర్ జి. గంగాధర్ గౌడ్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ప్రగతిని చాటి చెప్పేలా శకటాల ప్రదర్శన ఉండాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించే పోలీస్ కవాతు మైదానాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడానికి అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని పలు సూచనలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను అలరించేలా ఉండాలన్నారు. అతిథులకు, అధికారులకు గ్యాలరీ ఏర్పాటు చేయాలన్నారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యాలయంలో విశిష్ట సేవలు అందిస్తున్న అధికారులు, ఉద్యోగులకు అవార్డుల ప్రదానం జరుగుతుందన్నారు. ఇందుకోసం అన్ని శాఖలలో ఉద్యోగులను గుర్తించి వారి పేర్లను వెంటనే కలెక్టరేట్ కు పంపాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులను సత్కరించడానికి ఘనంగా ఆహ్వానించాలన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ వారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకోవడానికి జిల్లాలో విశిష్ట సేవలు అందిస్తున్న వ్యక్తుల, సంస్థల వివరాలను తెలుపవలసిందిగా ఆయన అధికారులకు సూచించారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల ద్వారా నిర్వహించే వినూత్న కార్యక్రమాలలో జాతీయ జెండా ప్రస్ఫుటంగా కనిపించే విధంగా ఫోటోలు తీసి %ఱఱఱ.ష్టుతీ స్త్రష్టుతీ‾అతీుఅస్తు.ఎశీఎ% వెబ్సైట్ నందు నమోదు చేయాలని ఆయన తెలిపారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గ్రామ, మండల స్థాయిలో పాఠశాల విద్యార్థులకు నా దేశం-నా జెండా అనే అంశంపై వ్యాసరచన పోటీలు, పెయింటింగ్ పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మండల స్థాయి విజేయతలకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించి విజేయతలైన వారికి ఆగస్టు 15వ తేదీన బహుమతులు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. మండల స్థాయిలో విజేయతలైన విద్యార్థులతో వారు వేసిన పెయింటింగ్ లతో, జాతీయ జెండాలతో స్థానిక కలెక్టరేట్లో ప్రదర్శన నిర్వహించారు. ఆర్ టి జి ఎస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులందరూ వారి కార్యాలయంలోని డాక్యుమెంట్లు, ప్రభుత్వ ఉత్తర్వులు, సర్క్యులర్ మెమోలు, కార్యాలయ ఉత్తర ప్రత్యుత్తరముల నన్నింటిని ఆన్లైన్లో



అప్లోడ్ చేయాలని ఇన్చార్జి జిల్లా సంయుక్త కలెక్టర్ జి గంగాధర్ గౌడ్ అధికారులకు సూచించారు. గత వారం రోజుల నుండి ఎవరూ డాక్యుమెంట్లను అప్లోడ్ చేయడం లేదని అన్నారు. రోజుకు సుమారు 100 డాక్యుమెంట్లను అప్లోడ్ చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. బాపట్ల, భీమవారిపాలెం, ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వారు రాఖీ పండుగ సందర్భంగా ఇన్చార్జ్ జిల్లా సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, పిడి డిఆర్డిఏ శ్రీనివాసరావు మరియు ఉప కలెక్టర్ లవన్నలకు రక్షాబంధన్ కట్టారు.

# నారా చంద్రబాబు దార్శనికతతో గ్రీన్ హైడ్రజన్, కార్బన్ క్యాప్చర్ పెట్టుబడులు భారీగా పెరిగాయి

కాకినాడ: ఆగస్టు 11 : గ్రీన్ హైడ్రజన్, కార్బన్ క్యాప్చర్ రంగాల్లో పెట్టుబడులు ?243 కోట్ల నుంచి ?569.9 కోట్లకు పెరిగాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. రాజ్యసభలో ఎంపీ సానా సతీష్ బాబు వేసిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర మంత్రి శ్రీపాద్ నాయక్ ఈ వివరాలు వెల్లడించారు. ఈ పెరుగుదలకు నారా చంద్రబాబు నాయుడు దర్శనికత, పెట్టుబడిదారుల నమ్మకం ప్రధాన కారణమని సానా సతీష్ బాబు తెలిపారు .రాష్ట్రంలో పునరుత్పాదక శక్తి, పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ఈ ప్రాజెక్టులు భవిష్యత్తులో మరిన్ని ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని తెలిపారు. ఎన్ టి పి సి ఆధ్వర్యంలో గ్రీన్ హైడ్రజన్, కార్బన్ క్యాప్చర్ వంటి ఆధునిక ప్రాజెక్టుల పెట్టుబడులు 2022%-%23లో ?243 కోట్ల నుండి 2024%-%25లో ?569.9 కోట్లకు పెరిగాయి.2025 జనవరిలో పుదిమడక గ్రీన్ హైడ్రజన్ హబ్‌కు శంకుస్థాపన జరిగింది. ఈ ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణలో స్థానికులకు ఉపాధి ప్రాధాన్యం ఇవ్వాలని ఎన్ టి పి సి ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.ఈ సందర్భంగా సానా సతీష్ బాబు మాట్లాడుతూ "ఈ ప్రాజెక్టులు రాష్ట్రానికి పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానిక యువతకు ఉపాధి



కలిగిస్తాయని,ఆంధ్రప్రదేశ్‌ను శుద్ధ ఇంధన రంగంలో ముందంజలో నిలపడం మా ప్రభుత్వం లక్ష్యం" అని సాన సతీష్ బాబు అన్నారు.

# ఆటో డ్రైవర్స్‌కి ప్రభుత్వం అండగా నిలుస్తుంది

## సిటీ ఎమ్మెల్యే కొండబాబు హామీ: ఉచిత బస్సు ప్రయాణం పథకం నేపథ్యంలో సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించిన ఆటో డ్రైవర్స్

కాకినాడ ఆగస్టు 11 : ఆటో డ్రైవర్స్ కి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) తెలిపారు. సోమవారం ఉదయం సిఐటియు ఆధ్వర్యంలో స్మార్ట్ సిటీ ప్యాసింజర్ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే కొండబాబు స్వగృహం వద్ద కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు,



అసోసియేషన్ అధ్యక్షుడు నురుకుర్తి ప్రకాశరావు లు మాట్లాడుతూ ఆటోల్లో ఎక్కువగా మహిళలే ప్రయాణం చేస్తున్న విషయం తెలిసిందే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రారంభించడం పట్ల స్వాగతిస్తున్నామని తెలిపారు. అయితే ఆటో డ్రైవర్స్ జీవనానికి భద్రత రాష్ట్ర ప్రభుత్వం వారే కల్పించాలని కోరుతున్నామన్నారు. ఆటో కు ఇంధనం వేయించి నెలకు 26,000 రూ. చెల్లిస్తే ప్రభుత్వ నిబంధనలకు లోబడి రోజుకు 8 గంటలు పాటు మహిళలను తమ గమ్యస్థానాలకు చేర్చడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మహిళల ఉచిత ప్రయాణంలో ఆటో డ్రైవర్స్ ని కూడా భాగస్వాములను చేయాలని కోరుతున్నామన్నారు. అదేవిధంగా రాపిడో వల్ల కూడా నష్టపోతున్నామని, ప్రభుత్వం వారే ఒక యాప్ ఏర్పాటు చేయాలని, ఇన్సూరెన్స్, ఫిట్ నెస్ చలనా ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని, ఆటో మరియు ఇతర ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్స్ కి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు.దీనిపై ఎమ్మెల్యే కొండబాబు స్పందిస్తూ ఆటో డ్రైవర్స్ సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయన్నారు. ఆటో డ్రైవర్స్ జీవనానికి ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన సహాయం అందిస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే స్పందన పట్ల యూనియన్ నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నక్కా కృష్ణ, కోయా రాజు, పెంకే చంద్రరావు, చెక్కల దుర్గా ప్రసాద్, అప్పారావు, నాగేశ్వరరావు, శ్రీను, ముత్యాలు , భాషా, కంచి శ్రీను, రవిచంద్ర, లతో సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ను కలిసిన నగర గణేశ ఉత్సవ సమితి జిల్లా కమిటీ



కాకినాడ ఆగస్టు 11 : 27వ తేదీ నుండి గణపతి నవరాత్రులు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాస్థాయిలో ప్రభుత్వ అధికారులు సమితి ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించేందుకు సంబంధిత శాఖలను ఆదేశించవలసిందిగా కోరుతూ సమితి జిల్లా ప్రతినిధి వర్గం జిల్లా కలెక్టర్ ను కలిసి అజెండా అంశాలను వినతి పత్రంగా వివరించారు. త్వరలో సమావేశం కాకినాడ ఆర్డిఓ ఆధ్వర్యంలో నిర్వహించి సమితి సూచనలు సలహాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ సగిలి షాన్మోహన్ తెలిపారు. సమితి చేపట్టిన జిల్లావ్యాప్త పర్యటనలో పిఠాపురం గొల్లప్రోలు కత్తిపూడి పెద్దాపురం సామర్లకోట తుని జగ్గంపేట అన్నవరం ప్రతిపాడు కాకినాడ సిటీ రూరల్ ఏరియాల్లో పర్యటించి సేకరించిన సమాచారం మేరకు గణేష్ నిమజ్జనం జరిగే రేవుల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు ఈ ఏడాది ప్రత్యేకంగా చేయాలని వివరించారు. చవితి పందిళ్ళ నిర్వాహకులకు ఆయా ప్రాంతాలలో సమితి ప్రతినిధులకు తగు సూచనలు చేసామని సమితి ప్రకటించింది కాకినాడ నగరం రూరల్ ఏరియాలో ఉన్న వివిధ ప్రాంతాలలోని అపార్ట్మెంట్ వాసులను కలిసి స్టిల్ట్ ఫ్లోర్లలో సోదర భావంతో సమైక్యంగా గణేష్ ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఇటువంటి ఉత్సవాలు అపార్ట్మెంట్లలో సామూహికంగా నిర్వహించుకోవడం వల్ల హిందువుల నడుమ సోదర భావం పెరుగుతుందని పిల్లల్లో చిన్నతనం నుండి ఆధ్యాత్మికత దేశభక్తి పెంపొందించడానికి ఉపయుక్తమవుతాయని పేర్కొన్నారు జిల్లా కలెక్టర్ కలిసిన వారిలో సమితి గౌరవ అధ్యక్షులు దూసర్లపూడి రమణరాజు పూర్వ అధ్యక్షులు దువ్వూరి సుబ్రహ్మణ్యం సమితి ఆహ్వాన కమిటీ కాకినాడ జిల్లా అధ్యక్షులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య రంబాల వెంకటేశ్వరరావు సమితి పదాధికారుల బృందం జిల్లా కలెక్టర్ ను కలిశారు మాల కొండయ్య మాట్లాడుతూ సెప్టెంబర్ 4 గురువారం వరకు నవరాత్రులు జరుగుతాయని ఆరవ తేదీ శనివారం గణేష్ నిమజ్జనం జరుగుతుందని ఆదివారం చంద్రగ్రహణం ఉన్నందున ముందుగానే గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై నవరాత్రులలో ప్రణాళిక చేసుకోవాలన్నారు చవితి ఉత్సవాలు చేసే వారందరూ ఆహ్వాన కమిటీలో గౌరవ సభ్యులుగా ఉంటారని దువ్వూరి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు నగరంలో నాలుగు జోన్లుగా రూరల్ మరియు జిల్లాలోని అన్ని కేంద్రాలలో సమితి పదాధికారుల సమావేశాలు జరుగుతాయని హైందవ సంప్రదాయం పట్ల గణపతి ఉత్సవాల పట్ల భక్తి భావం కలిగిన వారందరూ సమైక్య గణపతి నిమజ్జన ఉత్సవ నిర్వహణలో భాగస్వామ్యం కావాలని సమితి గౌరవ అధ్యక్షులు దూసర్లపూడి రమణ రాజు కోరారు కార్యక్రమంలో. పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో చేనేతలకు, మగ్గాలకు ఉచిత విద్యుత్

## శాసనసభ్యులు వనమాడి కొండబాబు




కాకినాడ ఆగస్టు 11 : ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం చేనేతన్నలకు కూటమి ప్రభుత్వం చేనేత మగ్గాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని, చేనేత వస్త్రాలపై 5% %+ూ% ని రాష్ట్ర ప్రభుత్వం భరించడం జరుగుతుందని, నేతన్న భరోసా (సంవత్సరానికి 25000/- ) పథకాన్ని అమలు జరుగుతుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం చేనేతలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నందుకు గాను సోమవారం ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యులు పప్పు దుర్గా రమేష్, కాకినాడ పట్టణ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు వింజమూరి వెంకట సుబ్బారావు (చినబాబు) ఆధ్వర్యంలో కాకినాడ సిటీ నియోజకవర్గం పరిధిలో చేనేతలతో కాకినాడ స్మార్ట్ సిటీ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) ముఖ్యఅతిథిగా థాంక్స్ యూ సి బి ఎన్ సర్ అనే నినాదంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి కృత్తతలు చెబుతూ ముందుగా చేనేత మాగ్గానికి పూజ చేసి, ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి అనంతరం 100 అడుగుల చేనేత చీరపై థాంక్స్ యూ సి బి ఎన్ సర్ నినాదంతో మెయిన్ రోడ్ నందు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వనమాడి కొండబాబు మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం చేనేత వర్గాలకు చేనేత మగ్గాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్, చేనేత వస్త్రాలపై 5% %+ూ% ని రాష్ట్ర ప్రభుత్వం భరించడం జరుగుతుందని, నేతన్న భరోసా (సంవత్సరానికి 25000/- ) పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని,చేనేత జాతీయోద్యమ నాయకుడు కీర్తిశేషులు శ్రీ ప్రగడ కోటయ్య గారి జయంతి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆయన భారీ విగ్రహాన్ని మంగళగిరి నేతన్న సెంటర్ వద్ద నిర్మాణానికి ప్రతిపాదించడం జరిగిందిని, చేనేతలకు ఎల్లప్పుడు అండగా ఉంటూ చేనేతల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని, కూటమి విజయంలో చేనేత వర్గ ప్రజలు కీలక పాత్ర పోషించడం జరిగిందిని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నగంటి సత్యనారాయణ, కాకినాడ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బడిగంటి దేవి, కాకినాడ జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు జగ్గారపు మల్లికార్జున, పసగడుగుల శేషగిరిరావు, దేవాంగ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షురాలు నక్కిన విజయలక్ష్మి, కర్ణభక్త సంక్షేమ సంఘం రాష్ట్ర కోశాధికారి గుడిమెట్ల వీర్రాజు, కరికాల భక్త సంఘం యువజన విభాగం నాయకుడు పోతా బత్తుల పవన్ కుమార్, పేక్స్ చైర్మన్, ఏ ఎం సి డైరెక్టర్ కొల్లు వెంకటేశ్వరరావు, సూపర్ బజార్ సీఈఓ వల్లభ దాస శివాజీ గణేష్, మాజీ ఎంపిటిసి చిల్లపల్లి గణపతి, పల్లెవెల లక్ష్మి రాజ్, మంచింశెట్టి నటరాజ్, శీరం లక్ష్మణప్రసాద్, పందిరి చంద్రశేఖర్, పొన్నగంటి రామారావు, తిప్పాని స్వరూప్, తుమ్మ కుమారి, ఇ%శీ%దన శ్రీనివాస్, పంపన వెంకటేశ్వరరావు, పాడిశెట్టి సుబ్రహ్మణ్యం, కడారి భవాని మధు, పప్పు వీర కుమార్, పచారి నాగేశ్వరరావు, చిలుకోటి రామ్మోహనరావు, పంపన ఎర్రం ప్రసాద్, శాగా సత్యలింగం, కొల్లి శివ నాగేశ్వరరావు, పందిరి చంద్రశేఖర్, తదితరులు హాజరయ్యారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కార్యక్రమంలో

## అందిన అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారాలు చూపాలి



కాకినాడ ఆగస్టు 11 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్..జేసీ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ మానీషబీ జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసు, సీపీవో పీ త్రినాథ్ ఇతర అధికారులతో కలిసి హాజరై, జిల్లా చుట్టుప్రక్కల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, తల్లికి వందనం ఆన్ లైన్ సమస్యలు వంటి అంశాలకు చెందిన మొత్తం 441అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ..ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కర కార్యక్రమం పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ నేపథ్యంలో ఆయా శాఖల్లో నమోదైన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం అందివ్వాలన్నారు.పరిష్కరించిన దరఖాస్తులను జిల్లా అధికారి ఆడిటింగ్ చేయాలని ఆయన సూచించారు. జిల్లా స్థాయి అధికారి ఆడిట్ చేసి నివేదిక పంపించిన తర్వాత వాటిని రాష్ట్రస్థాయిలో ఆడిట్ కి పంపించడం జరుగుతుందని ఆయన తెలిపారు. మరల మరల దరఖాస్తులు వచ్చే అంశాలపట్ల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన అర్జీదారులు తమ అర్జీలను Meekosam. ap. gov.in (మీకోసం.ఏపీ.జివోవి.ఇన్) వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చునని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీదార్లు తమ యొక్క అర్జీల నమోదు, అర్జీల ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి టోల్ ఫ్రీ నెంబర్ 1100 (డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా కాల్ చేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లా సమగ్ర అభివృద్ధి కి నిధులు కోసం ఎంమ్మెల్యే లు కృషి చేయాలి

## సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు : సీపీఐ గోడ పత్రిక ఆవిష్కరణ



కాకినాడఆగస్టు 11 : కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి 14 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఎంమ్మెల్యే లు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు పిలుపునిచ్చారు సోమవారం ఉదయం స్థానిక పి ఆర్ భవన్ లో సీపీఐ రాష్ట్ర 28 వ మహాసభలు గోడపత్రికను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరోద్యగం రాష్ట్రం లో తాండవం చేస్తుందని అన్నారు ఉద్యగాలు లేక పనులు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం జరుగుతుందని అన్నారు జిల్లా అభివృద్ధి జరగాలంటే నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని మధు కోరారు నరేంద్ర మోడీ అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తాం అని అన్నారు భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26వ తేదీన ఆవిర్భవించడం జరిగిందని అన్నారు. ఆనాటి నుంచి ఈ 100 సంవత్సరాల కాలంలో భారతదేశ గర్వించదగ్గ పాత్రను ఎర్ర జెండా భారత కమ్యూనిస్టు పార్టీ పోషించడం జరిగిందని అన్నారు. ఆనాడు ప్రైవేటు వ్యక్తుల చేతిలో బ్యాంకులో ఉండి విపరీతమైన లూటీలు జరుగుతున్న సందర్భంలోబ్యాంకుల జాతీయ కరణ కోసం రాజాభరణాల రద్దు కోసం భారత కమ్యూనిస్టు పార్టీ పోరాడి విజయాలు సాధించడం జరిగిందని అన్నారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం రావాలని భారత కమ్యూనిస్టు పార్టీ వీరులు అనేకమంది పోరాడి నేలకు వరిగారని అన్నారు. అండమాన్ జైల్లో మగ్గిపోయారని అయినప్పటికీ దీక్ష తోటి స్వాతంత్ర పోరాటంలో తమదైన శైలిలో కమ్యూనిస్టు చైతన్యం తోటి విప్లవకర దీక్ష తోటి ముందుకు సాగారని పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీలో అనేకమంది త్యాగ జీవులు తమ యొక్క వీరత్వాన్ని త్యాగపూరితమైనటువంటి విధానాన్ని చాటి చెప్పడం జరిగిందని అన్నారు. అందులో ముఖ్యంగా చెప్పాలంటే అమరజీవి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు,చల్లపల్లి జమీందారు 4, వేల ఎకరాల భూమిని పేదల పరం చేయడం కోసం వీరోచితమైన పోరాటం చేసి ఆ భూములను పేదలకు పంచటం జరిగిందని అన్నారు. ఇతరులకు పంచడమే కాదు తాను భూస్వామి కుటుంబంలో పుట్టి తన వాటా కింద వచ్చినటువంటి 400 ఎకరాల భూమిని కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు పేద ప్రజలకు పంచినటువంటి ధన్యజీవి అని కొనియాడారు. ఆయన యొక్క పోరాట స్ఫూర్తిని వారసత్వంగా తీసుకొని మేము భారత కమ్యూనిస్టు పార్టీగా 100 సంవత్సరాల సువర్ణ అక్షరాల చరితలో లిఖించదగినటువంటి భారత కమ్యూనిస్టు పార్టీ వారసులుగా ఉన్నందుకు గర్వపడుతున్నామని అన్నారు. భవిష్యత్తులో పేద ప్రజల ఇళ్ల స్థలాల సాధన కోసం దున్నేవాడికే భూమి కోసం కార్మికుల హక్కుల సాధన కోసం నరేంద్ర మోడీ అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు సీపీఐ జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శి కె బోదకొండ, తోకల ప్రసాద్ మాటాడుతూ స్వతంత్ర పోరాటంలో ఎర్రజెండా కృషి మరుగు లేనిదని ఆయన వివరించారు. లౌకిక వాదానికి వ్యతిరేకంగా రాజ్యాంగానికి వ్యతిరేకంగా బిజెపి మతోన్మాద చర్యలకు ఒడిగడుతుందని మండిపడ్డారు. కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ పెత్తందారుల పక్షాన మోడీ ఊడిగం చేస్తున్నారని ఆయన విమర్శించారు. సంవత్సరంలో రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ నరేంద్ర మోడీ గాలికి వదిలేసారని ఆయన అన్నారు. కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉంటేనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. సామాన్యులపై పన్నుల భారం పెరుగుతుంటే పడ కంపెనీల పన్ను మినహాయింపులు పొందుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలపై గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరల భారం పెరుగుతూనే ఉందని ఆయన అన్నారు. 23 నుండి 25 వరకు ఒంగూలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని 23 న భారీ ర్యాలీ బహిరంగ సభ జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పప్పు ఆదినారాయణ సలీం రాము శేఖర్ రావు సత్యం తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో 157 అర్జీలు స్వీకరణ

## 952300009 వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలు: కలెక్టర్ పి. ప్రశాంతి



రాజమహేంద్రవరం ఆగస్టు 11 : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తోందని, అర్జీలను నిర్ణీత గడువులో నాణ్యతతో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు.సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, అర్జీదారుల సమస్యలను ఓర్పుతో విని, మర్యాదపూర్వకంగా స్పందించాలని సూచించారు. పరిష్కరించగల అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలి. పరిష్కరించలేని వాటికి కారణాలు వివరించి అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు.మండలాల వారీగా రోజువారీగా ఫిర్యాదుల పరిష్కార తీరును సమీక్షించాలన్నారు. గ్రీవెన్స్ ఎక్కువగా ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి అర్జీపై ఎండోర్స్‌మెంట్ తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు.ఈరోజు మొత్తం 157 అర్జీలు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ %-% 71, పంచాయతీ రాజ్ %-% 43, విద్యుత్ %-% 7, పాఠశాల విద్య %-% 5, పోలీస్, పురపాలక తదితర శాఖలు %-% 31 ఉన్నాయి.కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామ మూర్తి, సిపివో ఎల్. అప్పలకొండ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎందుకు కన్నావమ్మా.. ఏడాదిలోపే రెండో బిడ్డను విక్రయించిన తల్లి.. డబ్బుల పంపకంలో తేడా రావడంతో..

అమరావతి :కన్నబిడ్డలనే కూరగాయలు అమ్మినట్లు అమ్మేస్తుంది. ఆనక కొనుగోలు చేసిన వారితో గొడవ పడుతుంది. చివరకూ పోలీసుల వద్దకు చేరి పంచాయితీ పెడుతుంది. ఈ కన్న తల్లి వ్యవహారం వివాదాస్పదంగా మారడంతో పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. వివరాల ప్రకారం.. బాపట్లలోని ఇందిరా నగర్ కాలనీకి చెందిన వెంకటేశ్వరమ్మ ఒక వ్యక్తితో సహజీవనం చేస్తోంది. వీరికి రెడు నెలల కిందట ఒక పాప పుట్టింది. అయితే ఆ పాపను లక్షన్నర రూపాయలకు క్రిష్ణా జిల్లా కోడూరుకు చెందిన అద్దెపల్లి గీతకు విక్రయించారు. గీతకు పిల్లలు లేకపోవడంతో బిడ్డను కొనుగోలు చేసింది. అయితే వెంకటేశ్వరమ్మ వద్ద నుండి గీత వద్దకు పాప చేరడానికి నలుగురైదుగురు మద్యవర్తులు పనిచేశారు. లక్షన్నర రూపాయలకు వెంకటేశ్వరమ్మ ఒప్పుకొని బిడ్డను ఇస్తే ఆమెకు అరవై వేల రూపాయలు మాత్రమే దక్కింది.దీంతో ఆమె మధ్యవర్తులతో గొడవకు దిగింది. అంతేకాకుండా బిడ్డను కొనుగోలు చేసిన గీతతోనూ ఘర్షణ పడింది. ఆ తర్వాత తన బిడ్డ సంగతి తేల్చాలంటూ రేపల్లే పోలీసులను ఆశ్రయించింది. రంగంలోని దిగిన పోలీసులు పాపను తీసుకొని బాపట్ల జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. పాపను బాల సదన్ కు చేర్చారు. వెంకటేశ్వరమ్మను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.పాపను విక్రయించే క్రమంలో బాపట్లకు చెందిన నూర్, జానీ, నగరం మండలం ప్రజ్నంకు చెందిన ఏడుకొండలు, అవనిగడ్డకు చెందిన లక్ష్మీ మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు పోలీసులకు విచారణలో తేలింది. వీరంతా తొంభై వేల రూపాయలు పంచుకొని అరవై వేల రూపాయలను మాత్రం వెంకటేశ్వరమ్మకు ఇచ్చారు. దీంతో వెంకటేశ్వరమ్మ వారితో ఘర్షణ పడినట్లు గుర్తించారు.అయితే.. వెంకటేశ్వరమ్మ గత ఏడాది అక్టోబర్ సమయంలోనే ఇదే విధంగా తన మొదటి బిడ్డ బాబును నెల్లూరు జిల్లా కావలికి చెందిన దంపతులకు విక్రయించింది. రెండు నెలల తర్వాత తన బిడ్డను తనకు ఇవ్వాలంటూ వారితో గొడవ పడటమే కాకుండా పోలీసులకు ఫిర్యాదు చేసింది.పోలీసులు దర్యాప్తులో మగ బిడ్డను వెంకటేశ్వరమ్మే విక్రయించినట్లు గుర్తించారు. అప్పుడు కేసు నమోదు చేసిన పోలీసులు కొంతకాలం తర్వాత మగ బిడ్డను వెంకటేశ్వరమ్మకే ఇచ్చేశారు. ఆ బిడ్డ ప్రస్తుతం ఆమె సహజీవనం చేస్తున్న వ్యక్తి వద్దే ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది.అయితే వెంకటేశ్వరమ్మ ఎందుకు శిశువులను విక్రయిస్తుందన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బిడ్డలను కన్న రెండు నెలల్లోపే విక్రయించడంపై ఆరా తీస్తున్నారు. వీరికి సహకరించిన వారందరిపై కేసులు నమోదు




చేసేందుకు బాపట్ల పోలీసులు సిద్ధమయ్యారు.


# అబ్బ.. జాలరి పంట పండింది పో..

## వలలో చిక్కింది చూసి దెబ్బకు స్టన్.. వామ్మో 5 గంటలు శ్రమించి..



అమరావతి :సముద్రంలో చేపలు పట్టేందుకు ఆశగా వేటకు వెళ్లారు మత్స్యకారులు.. పడవల్లో నుంచి గాలం వేస్తూ చేపల వేట కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే.. మత్స్యకారుల గాలానికి ఓ భారీ చేప చిక్కినట్లు అనిపించింది.. దీంతో పడవలో ఉన్న వారంతా అలర్ట్ అయ్యారు. ఎంత లాగినా.. పైకి మాత్రం రావడం లేదు.. దీంతో మరింత కష్టపడి చూశారు.. అదేంటో చూసి ఒక్కసారిగా గుండె ఆగినంత పనైంది.. దాదాపు 500 కిలోలున్న సొరచేప వారి గాలానికి చిక్కింది.. ముందు ఆ భారీ సొరచేపను చూసి వారంతా భయపడ్డారు.. ఎలాగొలా బయటకు తీసుకురావాలని అనుకున్నారు.. దాంతో కుస్తీ పట్టి.. దాదాపు 5 గంటలపాటు శ్రమించి తీరానికి లాక్కొచ్చారు. ఈ ఘటన అనకాపల్లి జిల్లా పూడిమడక తీరంలో చోటుచేసుకుంది.శనివారం అనకాపల్లి పూడిమడక తీరం నుంచి సముద్రంలోకి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు భారీ సొర చేప చిక్కింది. గాలానికి చిక్కిన సొరచేపను చూసి ముందు భయపడిన మత్స్యకారులు 5 గంటలపాటు కష్టపడి తీరానికి లాక్కొచ్చారు. ముందుగా సొర చేపను దగ్గరికి లాగి బల్లేలతో పొడిచారు.. దానిని పడవలోకి చేర్చలేక అలాగే తాడుతో కట్టి బయటకు లాక్కొచ్చారు.15 అడుగుల పొడవు, 500 కిలోల బరువైన సొర చేపను పూడిమడక తీరంలో ఇప్పటి వరకూ చూడలేదని, సాధారణంగా దీన్ని తింటారని పేర్కొంటున్నారు. దీన్ని వేలం వేయగా రూ.34 వేలకు ఓ వ్యాపారి కొనుగోలు చేసినట్లు మత్స్యకారుడు నూకరాజు తెలిపాడు..

# స్పష్టి అక్రమాల కేసులో ఈడీ ఎంట్రీ




అమరావతి :డాక్టర్ నమ్రత అండ్ గ్యాంగ్ అరాచకాలపై ఈడీ నజర్ పెట్టింది. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులోఈడీ రంగంలోకి దిగింది. కేసు వివరాలు ఇవ్వాలని హైదరాబాద్ పోలీసులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ లేఖ రాసింది. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ముసుగులో జరిగిన అక్రమాలు, అరాచకాల నిగ్గు తేల్చడంతో పాటు%ఔ%చేతులు మారిన, విదేశాలకు తరలిపోయిన కోట్లాది రూపాయల లావాదేవీల గుట్టు రట్టు చేయడానికి దర్యాప్తు సంస్థ నడుం బిగించింది. యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ పేరుతో మనీ లాండరింగ్ చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న నమ్రత నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు ఈడీ రెడీ అయింది.సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ పేరుతో డాక్టర్ నమ్రత..ఎనిమిది రాష్ట్రాల్లో తన అక్రమ దందాను సాగించారు. సరోగసీ ముసుగులో చైల్డ్ ట్రాఫికింగ్‌తో ఆమె కోట్లాది రూపాయలను కూడబెట్టారు. తక్కువ ధరకు పిల్లలను కొనుక్కుని వచ్చి%ఔ%.పిల్లలు లేని దంపతులకు సరోగసీ పేరుతో ఎక్కువ రేట్లకు అంటగట్టారు. నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలను కొనుగోలు చేసి, సంతానం లేనివారికి వాళ్లను అమ్మినట్లు గుర్తించారు. 30 మంది అరెస్ట్ తర్వాత, ఈ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 80మంది పిల్లలను చేతులు మార్చేసి%ఔ%పిల్లలు లేని జంటల నుంచి 25 కోట్ల రూపాయలు దర్జాగా కాజేసిన నమ్రత గ్యాంగ్..మనీ లాండరింగ్‌కు కూడా పాల్పడిందనే ఆరోపణలు, అనుమానాలు తెర పైకి వచ్చాయి. దీంతో సృష్టి క్లినిక్ ముసుగులో జరిగిన మనీ లాండరింగ్ మేటర్‌పై ఈడీ సీరియస్‌గా దృష్టి సారించింది.కోట్లాది రూపాయలు విదేశాలకు తరలింపు! MBBSలో తన బ్యాచ్‌మేట్లతో కలిసి పక్కా నెట్‌వర్క్ తయారు చేసిన డాక్టర్ నమ్రత ఈ దందాను నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్లారు. IVF, సరోగసీ పేరుతో పిల్లలు లేని జంటల నుంచి రూ. 30 నుంచి 40 లక్షల దాకా వసూలు చేశారు. ఈ దందాలో KGH డాక్టర్లతోపాటు ప్రైవేటు వైద్యులు, ఏజెంట్లతో డీల్స్ కుదుర్చుకున్నారు నమ్రత. ఇక ఇలా పోగేసిన కోట్లాది రూపాయలను కొందరు డాక్టర్లు%ఔ%హవాలా రూపంలో విదేశాలకు తరలించి అక్కడ పెట్టుబడులు పెట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ చైల్డ్ ట్రాఫికింగ్ మేటర్‌లో%ఔ%.సుమారు రూ.40 కోట్ల మేర హవాలా రూపంలో లావాదేవీలు జరిగినట్లు ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కుంభకోణంలో సరిగ్గా ఇదే కోణంలో%ఔ%మనీ లాండరింగ్ యాంగిల్‌లో ఈడీ విచారణ జరపనుంది.ఇక ఈడీ ఎంటర్ అవడంతో సృష్టి రహస్యాలు పూర్తిగా బయటపడే చాన్స్ ఉంది. ఇక్కడ దోచి, ఎక్కడో దాచిన కోట్లాది రూపాయల సొమ్ము గుట్టు రట్టు కానుంది. ఈడీ ఎంట్రీతో సృష్టి అక్రమాల దందాలో మనీ లాండరింగ్ కోణం వెలుగులోకి రానుంది.

# తలపై అడ్డాకులు.. భుజాలపై డోలీలు.. అడవి బిడ్డల వినూత్న నిరసన!

